## క్లుప్తంగా

### పరామర్శ

కదిరి అర్బన్: మండల పరిధిలోని కుమ్మరవాండ్లపల్లిలో విద్యుత్ శాఖ ఏఈ చెన్నకృష్ణ తల్లి పుల్లమ్మ (73) గురువారం మృతి చెందింది. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే డా.పీవీ సిద్దారెడ్డి శుక్రవారం పుల్లమ్మ మృతదేహానికి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు.

### సజావుగా వేలంపాట



వేలంపాట నిర్వహిస్తున్న అధికారులు

నల్లచెరువు: మండల పరిధిలోని పాలపాటిదిన్నె ఆంజనేయ స్వామి ఆలయంలో పూజా సామగ్రి, టెంకాయలు, పూలహారాలు, పార్కింగ్ ఫీజు వసూలు చేసుకునేందుకు ఈఓ రామాంజనేయులు, ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ దేవరింటి భాస్కర్‌రెడ్డి, సర్పంచ్ పంచరత్నమ్మ ఆధ్వర్యంలో శుక్రవారం వేలం పాట నిర్వహించారు. టెంకాయలు విక్రయ హక్కులను రూ. 2.70 లక్షలకు ఎస్. గోవిందు, పూలహారాల విక్రమ హక్కులను రూ.40 వేలకు ఎస్.వెంకట రమణ, పార్కింగ్ ఫీజు వసూలు హక్కులను రూ.27 వేలకు కె.రెడ్డెప్ప దక్కించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ అధికారి నరసింహులు, అర్చకులు ఆంజనేయదాస్, నాగరాజు, పాలక మండలి సభ్యులు గోవిందురెడ్డి, సూర్యనారాయణ, రామచంద్ర పాల్గొన్నారు.

### శ్రద్ధగా చదివితే ఉత్తమ మార్కులు



పదో తరగతి విద్యార్థులకు మోడల్ పేపర్లు అందిస్తున్న రోటరీ క్లబ్ సభ్యులు

గాండ్లపెంట: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న 120 మంది విద్యార్థులకు మోడల్ టెస్ట్ పేపర్లను రోటరీ క్లబ్ తరఫున డాక్టర్ ఇస్మాయిల్ ఆజాద్ శుక్రవారం పంపిణీ చేశారు. యూటీఎఫ్ వారు తయారు చేసిన 10వ తరగతి మాదిరి ప్రశ్నా పత్రాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. శ్రద్ధగా చదివి జిల్లా స్థాయిలో ప్రథమ స్థానంలో ఉత్తీర్ణులు కావాలని కోరారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ సభ్యులు కిషోర్‌కుమార్‌రెడ్డి, యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శ్రీనివాసులు, తాహిర్‌అలీ, వైవీ సుబ్బారెడ్డి, హెచ్‌ఎం మధురాంబ, కర్నాటక బ్యాంక్ మేనేజర్ రాజశేఖరరెడ్డి,ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### అమరజీవి జీవితం స్ఫూర్తిదాయకం



పొట్టి శ్రీరాములు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న అడిషనల్ ఎస్పీ విష్ణు

పుట్టపర్తి టౌన్: త్యాగమూర్తి, నిరాడంబరుడు, అహింసావాది, అమరజీవి పొట్టి శ్రీరాములు జీవితం ప్రతి ఒక్కరికి స్ఫూర్తిదాయకమని అడిషనల్ ఎస్పీ విష్ణు పేర్కొన్నారు. శుక్రవారం పోలీస్ కార్యాలయంలోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో పొట్టి శ్రీరాములు, వల్లభాయ్ పటేల్ వర్ధంతి జరిగింది. ఈ సందర్భంగా పోలీస్ సిబ్బంది జాతీయ నాయకుల చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. స్వాతంత్య్ర ఉద్యమంలో బ్రిటీష్ వారికి వ్యతిరేకంగా పోరాటాలు చేసిన మహనీయుడు వల్లభాయ్ పటేల్ అన్నారు. జాతీయ నాయకుల త్యాగాలు మరువలేనివని కొనియాడారు. కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ విజయకుమార్, ఏఓ సుజాత, ఆర్ఐ రాజశేఖర్‌రెడ్డి, ఆర్ఐ వెంకటేశ్వర్లు, డీపీఓ పాల్గొన్నారు.

### వైఎస్సార్‌సీపీ అనుబంధ కమిటీల్లో పలువురికి చోటు



డా.బత్తల హరిప్రసాద్

కదిరి అర్బన్: వైఎస్సార్ సీపీ బీసీ విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా కదిరికి చెందిన డా.బత్తల హరిప్రసాద్ నియమితులయ్యారు. వైఎస్సార్‌సీపీ అనుబంధ కమిటీలను పార్టీ కేంద్ర కార్యాలయం శుక్రవారం ప్రకటించింది. బీసీ విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా నియమితులైన హరిప్రసాద్‌కు పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు శుభాకాంక్షలు తెలిపారు.

కనగానపల్లి: వైఎస్సార్‌సీపీ జిల్లా అనుబంధ విభాగ కమిటీల్లో రాప్తాడు నియోజకవర్గం నుంచి పలువురికి చోటు కల్పించారు. శుక్రవారం సాయంత్రం పార్టీ కేంద్రం కార్యాలయం పార్టీ మహిళా, మైనార్టీ, ఎస్సీ సెల్ కమిటీలను ప్రకటించింది. రాప్తాడు నుంచి మహిళా విభాగంలో జిల్లా ప్రధాన కార్యదర్శిగా అనుసూయమ్మ, కార్యదర్శులు సరస్వతి, రెడ్డమ్మ, రత్నమ్మ, సహాయ కార్యదర్శులుగా బి.నాగమ్మ, ఎం. వెంకటలక్ష్మిని ఎంపిక చేశారు. జిల్లా మైనార్టీ ఉపాధ్యక్షుడిగా అబ్దుల్ మునాఫ్, ఎస్సీసెల్ కార్యదర్శిగా ఎనమల మహేష్, వైఎస్సార్‌టీయూసీ ఉపాధ్యక్షుడిగా పవన్‌కుమార్‌ను ఎంపిక చేశారు.

# బ్రహ్మోత్సవాల్లోపు భృగుతీర్థం సిద్ధం

- ఎమ్మెల్యే డా.పీవీ సిద్దారెడ్డి



కదిరి: కోనేరు పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే డా.పీవీ సిద్దారెడ్డి

కదిరి: ఖాద్రీ లక్ష్మీ నరసింహస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు ప్రారంభమయ్యే లోపు శ్రీవారి భృగుతీర్థం (కోనేరు) పనులు పూర్తి చేసి భక్తులకు అందుబాటులోకి తెస్తామని కదిరి ఎమ్మెల్యే డా.పీవీ సిద్దారెడ్డి స్పష్టం చేశారు. కోనేరు పునర్నిర్మాణ పనులను శుక్రవారం ఎమ్మెల్యే పరిశీలించారు. పక్కనే ఉన్న మద్దిలేరు వాగు నుంచి కోనేరులోకి మురుగు నీరు రాకుండా ఉండేందుకు ఈసారి చాలా జాగ్రత్తలు తీసుకుంటున్నామని చెప్పారు. గతంలో కురిసిన భారీ వర్షాలకు వాగులు, వంకలు పొంగి కోనేరు పూర్తిగా కొట్టుకుపోయిందని వెల్లడించారు. లేకుంటే ఈపాటికి కోనేరు సుందరంగా కన్పించేదన్నారు. గతంలో ఎంతో మంది నాయకులు బ్రహ్మోత్సవాల సమయంలో మాత్రమే కోనేరు గురించి మాట్లాడే వారని తెలిపారు. ఆ తర్వాత దీన్ని పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. కానీ తాను ఎన్నికల్లో ప్రజలకిచ్చిన మాట ప్రకారం కోనేరును సుందరంగా తీర్చిదిద్ది భక్తులకు అందుబాటులోకి తెస్తున్నానని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ గోపాలకృష్ణ, కమిటీ సభ్యులు, ఆలయ అధికారులు పాల్గొన్నారు.

**‘ఆడుదాం–ఆంధ్రా’ విజయవంతం చేద్దాం**

కదిరి: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఆడుదాం–ఆంధ్రా క్రీడా పోటీలను విజయవంతం చేద్దామని ఎమ్మెల్యే సిద్దారెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం ఎమ్మెల్యే తన క్యాంప్ కార్యాలయంలో ఆడుదాం–ఆంధ్రా క్రీడా పోటీలకు సంబంధించిన పోస్టర్లను విడుదల చేశారు. యువత పోటీల్లో పాల్గొని ప్రతిభను చాటుకోవాలని సూచించారు. ఇలాంటి పోటీలు గతంలో ఎన్నడూ జరగలేదన్నారు. నగదు బహుమతులు సైతం పెద్ద మొత్తంలో అందజేయనున్నట్లు తెలియజేశారు. విద్యార్థులకు చదువుతో పాటు ఆటలు కూడా ఒక భాగమన్నారు. క్రీడలు మానసిక ఉల్లాసాన్ని కలుగజేస్తాయని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా క్రీడాభివృద్ధి అధికారి ఉదయ భాస్కర్, ఎన్‌పీకుంట ఎంపీపీ వంకమద్ది రాము, వైఎస్సార్‌సీపీ యువ నాయకుడు ప్రణీత్‌రెడ్డి, కౌన్సిలర్ మహమ్మద్, టీచర్ శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

**అయ్యప్ప గుడి నిర్మాణానికి భూమిపూజ**

గాండ్లపెంట: మండల కేంద్రానికి సమీపంలోని జగనన్న కాలనీ వద్ద చిన్నమిట్టలో అయ్యప్ప సేవా సమితి ఆధ్వర్యంలో నిర్మిస్తున్న అయ్యప్ప స్వామి గుడి నిర్మాణానికి ఎమ్మెల్యే డాక్టర్ పీవీ సిద్దారెడ్డి శుక్రవారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా అయ్యప్ప మాలధారులు ఎమ్మెల్యేకు పూలమాల వేసి దుశ్శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో జక్కల లక్ష్మీనరసింహా గౌడ్‌స్వామి, ఎంపీపీ తాతం జగన్మోహన్, జెడ్పీ కో–ఆప్షన్ సభ్యుడు ఫయాజ్ అలీ, కన్వీనర్ గజ్జల రవీంద్రారెడ్డి, మాజీ కన్వీనర్ పోరెడ్డి చంద్రశేఖర రెడ్డి, మాజీ జెడ్పీటీసీ భాస్కర రెడ్డి, అయ్యప్ప మాలధారులు పాల్గొన్నారు.

### రూ.14 లక్షలతో సీసీ రోడ్డు పనులు



కదిరి పట్టణంలో సీసీ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే పీవీ సిద్దారెడ్డి

కదిరి అర్బన్: పట్టణంలోని కదిరి–హిందూపురం రోడ్డులో ఉన్న బంజారా హిల్స్ కాలనీలో శుక్రవారం రూ.14 లక్షల ఎంపీ నిధులతో నూతన సీసీ రోడ్డు నిర్మాణ పనులను ఎమ్మెల్యే డా.పీవీ సిద్దారెడ్డి ప్రారంభించారు. అలాగే మారెమ్మ గుడి నిర్మాణానికి భూమిపూజ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. బంజరాల అభివృద్ధికి తమ ప్రభుత్వం పాటుపడుతోందన్నారు. బంజారాలు ఇక్కడ సేవాలాల్ మహరాజ్ ఆలయం కూడా నిర్మించుకునేందుకు స్థలం ఉందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ యువ నాయకుడు ప్రణీత్‌రెడ్డి, నాయకుడు మధుసూదన్‌రెడ్డి, వైస్ ఎంపీపీ ఆనంద్‌నాయక్, ఎస్టీ సెల్ నాయకులు కృష్ణానాయక్, యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మణికంఠ నాయక్, పట్నం సర్పంచ్ చలపతి నాయక్ పాల్గొన్నారు.

# జగనన్నతోనే రాష్ట్రాభివృద్ధి



రైతుకు ప్రభుత్వ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి

- ‘గడప గడపకూ మన ప్రభుత్వం’లో ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి

పుట్టపర్తి: సీఎం జగన్ మోహన్‌రెడ్డితోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యం. గడిచిన నాలుగున్నరేళ్లలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందించింది. సీఎం జగన్‌ను వచ్చే ఎన్నికల్లో మరోసారి ఆశీర్వదించాలని ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి ప్రజలను కోరారు. శుక్రవారం సిద్ధరాంపురంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పార్టీలు, కులాలకు అతీతంగా పథకాలు అమలు చేసిన ఘనత జగనన్నకే దక్కుతోందన్నారు. గతంలో ఏ రాష్ట్ర ప్రభుత్వం ఇంత పెద్ద ఎత్తున సంక్షేమ పథకాలు అందించిన దాఖలాలు లేవని పేర్కొన్నారు. జగన్ పాదయాత్రలో చెప్పిన విషయాలతో పాటు ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో 98 శాతం నెరవేర్చారని వెల్లడించారు. అర్హత ఉండి పథకాలు అందని వారు ఎవరైనా ఉంటే వెంటనే తనను సంప్రదించాలని సూచించారు. ఈ నాలుగున్నర సంవత్సరాల్లో సిద్ధరాంపురం పంచాయతీ పరిధిలో రూ.45 కోట్ల లబ్ధి చేకూరిందని తెలిపారు. నిరుద్యోగులకు సచివాలయాల ద్వారా పెద్ద సంఖ్యలో ఉద్యోగాలు కల్పించిన ఘనత జగన్ సర్కార్‌కే దక్కుతోందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ రమణయ్య, మండల కన్వీనర్ సుధాకర్‌రెడ్డి, ఎంపీపీ శ్రీధర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు కేశప్ప, మండల సచివాలయాల కన్వీనర్ గోవర్ధన్‌రెడ్డి, సీనియర్ నాయకులు వెంకటరెడ్డి, పుల్లారెడ్డి, స్నేహిన్‌రెడ్డి, నేలకోటప్ప, బాబురెడ్డి, సొసైటీ మాజీ అధ్యక్షుడు మాధవరెడ్డి, మండల అగ్రి అడ్వైజరీ బోర్డు చైర్మన్ వెంకటచౌదరి, మాజీ ఎంపీటీసీలు చెన్నారెడ్డి, మల్లేశ్, వైస్ సర్పంచ్ చెన్నప్ప, బొజ్జప్ప, వేణుగోపాల్‌రెడ్డి, నరసింహారెడ్డి, మనోహర్ రెడ్డి, కృష్ణారెడ్డి, రామమోహన్, బ్రహ్మానందరెడ్డి, ప్రభాకర్ రెడ్డి, ప్రసాద్, కేశప్ప, పార్టీ మండల సమన్వయకర్తలు మల్లికార్జున, రఘునాథరెడ్డి, సర్పంచులు, ఎంపీటీసీలు, మాజీ సర్పంచులు పాల్గొన్నారు.

# భూగర్భ జలాల పెంపే లక్ష్యం



రంగస్వామి కుంటను పరిశీలిస్తున్న అవుటాల రమణారెడ్డి, అధికారులు

పుట్టపర్తి టౌన్: భూగర్భ జలాల పెంపే లక్ష్యంగా పని చేస్తామని జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ అవుటాల రమణారెడ్డి, ఇరిగేషన్ ఈఈ గంగాధర్ పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని బీడుపల్లి అటవీ ప్రాంతంలో మరమ్మతుకు గురైన రంగస్వామి కుంటను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బీడుపల్లి అటవీ ప్రాంతంలో రైతులు 60 బోరుబావులు వేసుకుని పండ్ల తోటలు, ఇతరత్రా పంటలు 250 ఎకరాల్లో పంటలు సాగు చేస్తున్నట్లు తెలిపారు. బోరు బావుల రీచార్జ్ కోసం గతంలో రంగస్వామి కుంటను నిర్మించారు. అయితే నాసిరకంగా నిర్మించడంతో మరమ్మతులకు గురైనట్లు పేర్కొన్నారు. ఎగువ ప్రాంతం నుంచి వస్తున్న వర్షపు నీరు వృథాగా దిగువ ప్రాంతానికి పోతుండటంతో బోరు బావుల్లో నీటి నిల్వలు తగ్గుతున్నట్లు తెలిపారు. కుంటను మరమ్మతులు చేయిస్తే భూగర్భ జలాలు పెరిగి బోర్లు రీచార్జ్ అవుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. వేసవిలో కూడా పంటలను కాపాడుకోవచ్చని పేర్కొన్నారు. కుంట మరమ్మతులకు అయ్యే ఖర్చును అంచనా వేసి ప్రభుత్వానికి నివేదికలు పంపుతామన్నారు. పనులు ప్రారంభిస్తామన్నారు. కార్యక్రమంలో డీఈ గంగాధర్, జేఈలు జమునాబాయి, సుధాకర్‌రాజు, సింగిల్ విండో అధ్యక్షుడు రుషీకేశవరెడ్డి, రైతులు ఈశ్వర్‌రెడ్డి, నాగిరెడ్డి, రామచంద్రారెడ్డి, సుదర్శన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# గుర్తింపు కార్డుల పంపిణీ



విద్యార్థులకు గుర్తింపు కార్డులు అందజేసిన వైఎస్సార్‌సీపీ నాయకుడు పాల్యం సుధాకర్

ఎన్‌పీకుంట: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న 480 మంది విద్యార్థులకు వైఎస్సార్‌సీపీ నాయకుడు పాల్యం సుధాకర్ చేతుల మీదుగా శుక్రవారం ఐడెంటిటీ (గుర్తింపు) కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పలువురు ఉపాధ్యాయులు మాట్లాడుతూ.. పేద విద్యార్థుల విద్యాభివృద్ధికి పాల్యం సుధాకర్ తోడ్పాటు అందిస్తున్నారని తెలిపారు. గతంలో కూడా విద్యార్థుల బస్సుపాసుల కోసం వేల రూపాయలు ఖర్చు చేశారని కొనియాడారు. అనంతరం పాలెం సుధాకర్ మాట్లాడుతూ.. ఉపాధ్యాయుడు కె.రిజ్వానుల్లాఖాన్ సూచనలతో ఐడెంటిటీ కార్డులు అందజేసినట్లు తెలిపారు. అనంతరం పాల్యం సుధాకర్‌ను ఉపాధ్యాయులు, విద్యార్థులు సత్కరించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు శిరిషారెడ్డి, స్కూల్ కమిటీ చైర్మన్ భాస్కర్, ఉపాధ్యాయులు మురళి, రిజ్వానుల్లాఖాన్, వెంకటరామిరెడ్డి, రామాంజులు యాదవ్, రమణానాయక్, షఫీ తదితరులు పాల్గొన్నారు.

**ఆలయ నిర్మాణానికి విరాళం**

ఎన్‌పీకుంట: మండల పరిధిలోని తిమ్మమ్మమర్రిమానులో నూతనంగా నిర్మిస్తున్న ఈశ్వరమల్లె లక్ష్మీనరసింహ స్వామి ఆలయానికి వైఎస్సార్‌సీపీ నాయకుడు పాల్యం సుధాకర్ రూ.50,000 విరాళం అందించారు. ఆలయ కమిటీ సభ్యులు వెంకటనారాయణ, నారాయణస్వామికి శుక్రవారం విరాళం మొత్తాన్ని అందించారు. అలాగే త్వరలో ప్రతిష్టించనున్న శ్రీకృష్ణదేవరాయల విగ్రహానికి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు.

# నవరత్నాలతో పేదలందరికీ లబ్ధి



ధర్మవరంలో పథకాల బ్రోచర్లు విడుదల చేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ కాచర్ల లక్ష్మి



ముదిగుబ్బ మండలం ఉప్పలపాడు సచివాలయం వద్ద జెండా ఆవిష్కరణ

ధర్మవరం: నవరత్నాలతో అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందించిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని మున్సిపల్ చైర్‌పర్సన్ కాచర్ల లక్ష్మి, వార్డు సచివాలయాల కన్వీనర్లు చందమూరి నారాయణరెడ్డి, మాసపల్లి సాయికుమార్ అన్నారు. పట్టణంలోని 23వ వార్డులో శుక్రవారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. వార్డులో చేపట్టిన అభివృద్ధి పనులను వివరిస్తూ.. పథకాల బోర్డును ఆవిష్కరించారు. అనంతరం వైఎస్సార్‌సీపీ పార్టీ జెండాను ఎగురవేసి ఇంటింటా తిరుగుతూ జగన్ పాలనపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ ఎస్‌పీ షకీలా, కో–ఆప్షన్ సభ్యుడు షేక్ షమీన్, వైఎస్సార్‌సీపీ పట్టణాధ్యక్షుడు కోటిరెడ్డి బాలిరెడ్డి, ప్రకాష్, వార్డు ఇన్‌చార్జ్‌లు ఎస్‌పీ బాష, చాంద్‌బాషా, సుబహాన్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ముదిగుబ్బ: మండల పరిధిలోని ఉప్పలపాడు సచివాలయంలో శుక్రవారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా గృహసారథులకు, వలంటీర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులకు పథకాలపై అవగాహన కల్పించారు. అనంతరం వైఎస్సార్‌సీపీ జెండాను ఆవిష్కరించి వందనం చేశారు. కార్యక్రమంలో సింగిల్ విండో అధ్యక్షుడు బీఏ ఓబిరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు వెంకటేశ్వర్ రెడ్డి, లక్ష్మీనారాయణరెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, నాగేంధర్‌రెడ్డి, పరంధామరెడ్డి, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

### పాదయాత్రకు సంఘీభావం

ముదిగుబ్బ: ఇడుపులపాయ నుంచి ఇచ్ఛాపురం వరకు వై నాట్ 175 నినాదంతో బసవరాజు బృందం ఆధ్వర్యంలో చేపట్టిన పాదయాత్ర శుక్రవారం మలకవేమలకు చేరింది. ఈ సందర్భంగా సర్పంచ్ వెంకటరమణ, నాయకులు భాస్కర్‌రెడ్డి, యోగీశ్వర్‌రెడ్డి, మస్తాన్‌రెడ్డి, వెంకటరమణ, ఈశ్వర్‌రెడ్డి, చంద్రానాయక్ తదితరులు పాదయాత్ర బృందానికి సంఘీభావం తెలిపారు.

### శుభకార్యం

తాడిమర్రి: కాటికోటేశ్వర క్షేత్రంలో శుక్రవారం చిల్లవారిపల్లికి చెందిన పెద్ద శివారెడ్డి కుమారుడు నందకుమార్ రెడ్డి వివాహ జరిగింది. వివాహ వేడుకల్లో ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డి పాల్గొని, వధూవరులను ఆశీర్వదించారు. కార్యక్రమంలో సర్పంచ్ పిట్టు పెద్ద శివారెడ్డి, డీసీఎంఎస్ చైర్మన్ తాడిమర్రి చంద్రశేఖర్‌రెడ్డి, ఎంపీపీ పాటిల్ భువనేశ్వర్‌రెడ్డి, సింగిల్‌విండో అధ్యక్షుడు వైటీ చంద్రశేఖర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు జొల్లిరెడ్డి అశ్వర్థ, పరమేశ్వర్ రెడ్డి, నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### వైకుంఠ ఏకాదశి వేడుకల నిర్వహణకు టెండర్ల ఆహ్వానం

కదిరి టౌన్: ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ఈనెల 23వ తేదీన వైకుంఠ ఏకాదశి (ముక్కోటి ఏకాదశి) జరగనుంది. ఆలయంలో ప్రత్యేక పుష్పాలంకరణ, స్వాగత తోరణాలు, ఆర్చులు, ఉత్తర రాజగోపురం వద్ద ప్రత్యేక అలంకరణ, విద్యుత్ అలంకరణ, క్యూలైన్ బారికేట్స్ ఏర్పాటు చేసుకునే హక్కులకు (ఒక రోజు) ఈనెల 20వ తేదీన సీల్డ్ టెండర్ నిర్వహిస్తున్నట్లు ఆలయ చైర్మన్, ఆలయ ఈఓ శ్రీనివాసరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ధరావత్తు రూ.25 వేలు చెల్లించాలన్నారు. వివరాలకు 9885748667 నంబర్‌కు సంప్రదించాలన్నారు.

# ఉత్తమ ఫలితాలు సాధించాలి



ధర్మవరంలో మాట్లాడుతున్న డీఈఓ మీనాక్షి



ఎస్‌సీఈఆర్‌టీ డైరెక్టర్‌కు వినతిపత్రాన్ని అందిస్తున్న ఉపాధ్యాయ సంఘాల నేతలు

ధర్మవరం అర్బన్: పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న శ్రీ సత్యసాయి సంకల్పం కార్యక్రమాన్ని శుక్రవారం సాయంత్రం డీఈఓ మీనాక్షి పర్యవేక్షించారు. పదో తరగతి విద్యార్థులకు సాయంత్రం నిర్వహించే ప్రత్యేక తరగతులపై ఆరా తీశారు. అర్థమయ్యేలా ఉపాధ్యాయులు బోధిస్తున్నారా లేదా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. బాగా చదువుకుని మంచి ఫలితాలు సాధించాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం శైలజ, హిందీ పండిట్ వేణుగోపాలాచార్యులు, రామకృష్ణ, పీడీ నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

**పని రోజుల్లో శ్రీసత్యసాయి సంకల్పం అమలు చేయాలి**

పుట్టపర్తి: పాఠశాలల పని రోజుల్లో మాత్రమే శ్రీ సత్యసాయి సంకల్పం అమలు చేయాలని పీఆర్‌టీయూ, వైఎస్సార్‌టీఎఫ్ నాయకులు కోరారు. శుక్రవారం ఆయా సంఘాల నాయకులు విజయవాడలో ఎస్‌సీఈఆర్‌టీ డైరెక్టర్ ప్రతాప్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. డైరెక్టర్ మాట్లాడుతూ.. రాష్ట్రస్థాయి అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. నాయకులు అశోక్ కుమార్‌రెడ్డి, రమణారెడ్డి, విష్ణువర్ధన్ రెడ్డి, రజనీకాంత్‌రెడ్డి, సురేంద్ర, పాల్గొన్నారు.

## సంక్షిప్త సమాచారం

**కందిలో పంటకోత ప్రయోగాలు**

బత్తలపల్లి: మండల పరిధిలోని గంటాపురం వద్ద సర్వే నంబర్ 106–1బీలో రైతు శివమ్మ సాగు చేసిన కంది పంటలో సత్యసాయి జిల్లా గణాంకశాఖ అధికారి విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో పంటకోత ప్రయోగాలు చేశారు. ఏఎస్‌ఓ డాక్టర్ లక్ష్మీనరసింహ శర్మ, వీహెచ్‌ఏ హసీనాబీ ప్రభుత్వం నిర్దేశించిన కొలతల్లో కంది పంటను తొలగించారు. ఏడు రోజుల తర్వాత తూనికలు వేసి పంట దిగుబడి అంచనా వేయనున్నట్లు తెలిపారు. ఓరియంటల్ ఇన్సూరెన్స్ కంపెనీ జిల్లా కో–ఆర్డినేటర్ చంద్రమోహన్, మండల కో–ఆర్డినేటర్ నాగభూషణ, ఏఈఓ ఉపేంద్రరెడ్డి, వీఆర్‌ఏ నరసింహులు పాల్గొన్నారు.

**తెరచుకున్న అంగన్‌వాడీ కేంద్రాలు**

అమడగూరు: అంగన్‌వాడీ కేంద్రాలను యథావిధిగా నిర్వహిస్తామని అధికారులు పేర్కొన్నారు. శుక్రవారం మండల స్థాయి అధికారులు అన్ని గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాలను తెరిపించారు. పిల్లలను కూర్చోబెట్టారు. అనంతరం బడిలో పంచనామా నిర్వహించి స్టాకును రికార్డుల్లో రాశారు. అధికారులు మాట్లాడుతూ.. జీతాలను పెంచాలని కార్యకర్తలు సమ్మెలోకి వెళ్లడం సరికాదన్నారు. సమ్మె విరమించే వరకూ ఐకేపీ సంఘాలు, ఉపాధ్యాయులు, సచివాలయ సిబ్బంది ద్వారా బడులను నిర్వహిస్తామని తెలిపారు. పిల్లలు, తల్లిదండ్రులకు ఇబ్బందులు కలగకుండా చూస్తామన్నారు. అలాగే పౌష్టికాహారాన్ని ఎప్పటికప్పుడు పంపిణీ చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ మునెప్ప, తహసీల్దార్ వెంకటరెడ్డి, ఎస్ఐ బలరామయ్య, ఏపీఎం గోపాల్, పాల్గొన్నారు.

**న్యాయవాదుల రిలే నిరాహార దీక్షలు**

ధర్మవరం అర్బన్: భూ యాజమాన్య హక్కు చట్టం రద్దు చేయాలని బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎంపీ సుబ్బారావు, ప్రధాన కార్యదర్శి రాఘవేంద్ర కోరారు. పట్టణంలోని కోర్టు ఎదుట బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు శుక్రవారం మూడో రోజుకు చేరుకున్నాయి. న్యాయవాదులు రంగరాజభట్టార్, మహబూబ్‌జాన్, బాబా ఫక్రుద్దీన్, వెంకటరామిరెడ్డి, మోహన్ పాల్గొన్నారు.

**రేపు పెన్షనర్ల దినోత్సవం**

కదిరి: స్థానిక పెన్షనర్ల భవనంలో ఈనెల 17న పెన్షనర్ల దినోత్సవాన్ని నిర్వహించనున్నట్లు ఆ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు బీవీ శివారెడ్డి, పి.ఆత్మారెడ్డి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. 75 ఏళ్లు పూర్తి చేసుకున్న పెన్షనర్లను సన్మానిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కదిరి ఆర్‌డీఓ సన్నీ వంశీకృష్ణ, డీఎస్పీ శ్రీలత, అసిస్టెంట్ ట్రెజరీ ఆఫీసర్ పార్థసారథి, ఎస్‌బీఐ రీజనల్ మేనేజర్ వెంకటేశ్వరరావు, ఎస్‌బీఐ మేనేజర్ ఫణికుమార్ తదితరులు హాజరవుతారన్నారు.

### పాటలతో ఆకట్టుకున్న అంధులు

బత్తలపల్లి: మండల కేంద్రంలోని శ్రీజ్యోతి హైస్కూల్‌లో శుక్రవారం అంధులు తమ గాన మాధుర్యంతో అందరినీ అలరించారు. ప్రధానోపాధ్యాయుడు మిడతల లక్ష్మీనారాయణ మాట్లాడుతూ.. అంగవైకల్యం ఉన్నా వీరిలో అపారమైన ప్రతిభ ఉందన్నారు. హైదరాబాద్ సోచ్ సంస్థ నుంచి వచ్చినట్లు వివరించారు. అనంతరం త్వరలో ప్రారంభమయ్యే అంధుల అనాథ శరణాలయానికి విరాళం అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ధర్మతేజ, నాగపెద్దిరాజు, కాటమయ్య, వెంకటపతి, శంకరయ్య, రమేష్, రాజశేఖర్, ధనలక్ష్మి, షబానా, షమీల, లక్ష్మి పాల్గొన్నారు.

**‘గిరిజన శంఖారావం’ విజయవంతం చేయాలి**

పుట్టపర్తి రూరల్: జనవరి 7న విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో జరగనున్న గిరిజన శంఖారావం జయప్రదం చేయాలని గిరిజన సమాఖ్య జాతీయ సమాఖ్య ఉపాధ్యక్షుడు మల్లికార్జున నాయక్ పిలుపునిచ్చారు. శుక్రవారం పుట్టపర్తి పట్టణంలో సాయిఆరామంలో వాల్‌పోస్టర్లను విడుదల చేశారు. నారాయణస్వామి నాయక్, శ్రీనివాసులు నాయక్ , ప్రసాద్‌నాయక్, సుమతీ భాస్కర్, హనుమంతప్ప, హుస్సేన్‌పీరా పాల్గొన్నారు.